# సుగుణ

[పెద్దకథ]

శ్రీ బలివాడ కాంతారావు

వేసంగాలం. అమ్మ ఒక్కపదిరోజులైనా వుండామని వచ్చింది. వచ్చిన నాలుగోరోజునాడే నాన్నకు కాస్త జ్వరం కాస్తున్నదని రంగారాయపురంనుంచి కబురు వచ్చింది. అమ్మను రైలెక్కించి వచ్చాను. తలుపు చాలాసేపు తట్టితేగాని సుగుణ తీసింది కాదు. తీశాక చరచరా పెరటి వరండాలోనికి వెళ్లిపోయింది.

తలుపు గడియవేసి వెనకాలే వెళ్లాను. సుగుణ నా వేపు చూడలేదు. పశ్చిమదిశను ఆకాశం అరుణరేఖలమయమైయుంటే అటువేపే దీక్షగా చూస్తోంది. ఆమె కళ్లల్లోనికి చూశాను. కాస్త యెర్రబడివున్నాయి.

ఆమెను నవ్వించే మాటలుగాని, చేష్టలుగాని చేయటానికి నా మన సెందుకో పోలేదు. ఆ మోము వివర్ణమై వుండటంవలన బహుశః భయపడి వూరుకొని వుండవచ్చు. ఒక్క మాటైనా ఆడకుండా గదిలోనికి పోయాను. వీథితలుపు, కిటికీలు తెరచినా గాలి లేదు. కమీజు స్టాండుకు తగిలించాక విసనకర్ర చేతపట్టుకున్నాను.

ఆడవాళ్లకు యెందుకు కోపం వస్తుందో నాకు తెలియదు. నిజానికి యెవరికీ సరిగా తెలీదనుకుంటాను. అప్పట్లో సుగుణతో వాదించి మరింత రాద్ధాంతం చెయ్యటానికి నా మనసు పోలేదు. అయినా విసురుకుంటూ ఆమెదగ్గరగా వెళ్లాను.

'ఒక్క కోరిక సుగుణా' అన్నాను. ఆహ్లాయంగా. ఒకసారి నా వేపు చటుక్కున చూసి మరల తల త్రిప్పింది.

'ఏమీ లేదు. ఇక్కడ అసలే గాలి లేదు. అలా సముద్రపొడ్డుకు పోయామంటే...నీ యిష్టం'

ఇంచుమించు ఐదు నిమిషాలవరకు అలా నిలుచున్నాను. సుగుణ లేచింది. సబ్బుతో ముఖం కడుక్కుంది. ఒక పావుగంటలో తయారు. ముఖంమాత్రం కళగా లేదు.

బీచిలో నా మనసు సుగుణ యీ నటనకు కారణ మేమిటో కనుక్కోవా లని వురకలు వేసింది. కాని అతిప్రయత్నంమీద అణచివేశాను. సుగుణ కళ్లల్లోనికి జాలిగా ఒకసారి చూడకుండా వుండలేకపోయాను. ఆమె ముఖం ప్రక్కకు తిప్పింది. ప్రయత్నంమీద నా దృష్టిని హోరుమంటున్న రత్నగర్భ వేపు మరల్చాను.

బాగా చీకటిపడింది. సముద్రపు కెరటాలు మాకు యించుమించు గజందూరంవరకు వచ్చి వెనకకు దిగజారిపోతున్నయ్. నా మనసు కూడ అలానే వుంది. అప్పుడే సముద్రగర్భంనుంచి చందమామ లేస్తున్నాడు. ఆ లేతవెలుగు సాగరజలముమీద ప్రసరిస్తోంది. ఆ

దృశ్యం నా హృదయంలో యేవో తీయనికోరికలను మొలకలెత్తిస్తోంది. సుగుణవేపు చూశాను. ఆమెదృష్టి కూడ అటువేపే వున్నట్లు గుర్తించాను. హాయిగొల్పే పవనాల తాకిడికి ఆమెముంగురులు మెల్లగా కదులుతున్నయ్. ఆ లేవెలుగులో ఆ మోములోని బంగారు తళుకు నన్ను వెర్రెత్తించింది. నా కుడిచేయి ఆమె ముంగురులమీద ప్రయత్నంలేకుండానే వ్రాలిపోయింది.

సుగుణలో యెటువంటి చాంచల్యం కనిపించలేదు. నేను మాటాడుదామని ప్రయత్నించానుగాని గొంతుక పట్టుకపోయింది.

చందమామ మెరుగెక్కేసరికి ఆమెకళ్లలోనుంచి మెల్లగా కన్నీటిధారలు చెక్కిళ్లపైనుంచి జారటం చూశాను.

‘నన్నా యేడవమంటావా సుగుణా!’ అన్నాను.

‘ఎందుకూ?’—కాస్సేపు ఆగి—‘మొగాళ్లెప్పుడూ ఏడక్కరలేదు’అంటూ ఒక్కసారి రెండు ముడుకులమీద తల ఆన్చింది. పైకిమాత్రం ఏడుపు వినపడలేదు.

నిజానికి నా మనసు అప్పుడు తూట్లుపడినా సర్దుకొని ఒక నిశ్చయానికి వచ్చాను. ఆ విషయంతో నాకు సంబంధం లేనట్లే మామూలుగా తిరుగుతుంటే సుగుణలో యెలాంటి మార్పు వస్తుందో గమనిద్దామనిపించింది.

లేచి నిలుచున్నాను. ‘ఆకలవుతోంది. లే, పోదాం. ఇంట్లో దీపం వెల్గించకుండా వచ్చేశాం కూడాను.’

చీరకొంగుతో కళ్లు తుడుచుకొని లేచింది. నాప్రక్కనుంచి నడవలేదు. వెనకాల నడచింది. రోడ్డుమీద మాటాడుకొనే అవసరం నాకేమీ లేకపోయింది.

అడక్కుండానే అన్నం పెట్టింది. దగ్గర కూర్చొని యిదివరలా కబుర్లు చెప్పటానికి రాలేదు. నేనుమాత్రం పిలవటం మానలేదు. మూడు పిలుపులకు జవాబు లేదు. అన్నం కలపకుండా లేచిపోయాను. డాబా మెట్లు యెక్కుతుంటే వంటయింటి గుమ్మం దగ్గర నిలుచుని నావేపు చూడటం గుర్తించకపోలేదు.

డాబామీద కూర్చున్నాగాని నా మనస్సంతా క్రిందనే వుంది. ఒంటరిగా కూర్చోటం కష్టంగానే వుంది. సుగుణ వస్తుందని నేననుకోలేదు. ఆమె డాబామీదకు వచ్చి ‘క్షమించండి. మీదగ్గరగానే కూర్చుంటాను. నవ్వుతూనే భోం చెయ్యొచ్చు.’

నేను లేచాను. నా పాచిక పడిందన్న సంతోషం ఒక లిప్తలోనే మాయమయ్యింది. నా అవివేకానికి, క్షుద్రభావానికి నొచ్చుకున్నాను. యెదురుగా సుగుణ కూర్చుంది. నా లజ్జ నన్ను ఆమె మోమువేపు చూడనిచ్చిందికాదు. గబగబ నాలుగు మెతుకులు నమిలి లేచిపోయాను.

గదిలోనికి పోయి కుర్చీమీద కూర్చున్నాను. అప్పుడప్పుడు అప్రయత్నంగా వరండావేపు చూస్తున్నాను. సుగుణ కనిపించలేదుగాని నే తిన్న కంచం అలాగనే వుంది. యించుమించు ఒక పదినిముషాల వరకు చూసి మనసొప్పక వరండాలోనికి వెళ్లాను. సుగుణ నేను వచ్చినట్లు గుర్తించనట్లే యేదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లుంది.

‘భోజనం చెయ్యాలని లేదా?’అని ప్రశ్నించానేగాని అంతలో నాప్రశ్నలో యేదో వ్యంగ్యం యిమిడివుందని కాస్త నసుగుతూ ‘లే. భోం చెయి సుగుణా’ అన్నాను.

సుగుణ గప్పున లేచింది.

‘నేను భోంచెయకపోతే నా కడుపు మాడుతుందిగాని మీది కాదుగా! అయినా తినటానికి వుండగా కడుపు మాడ్చుకొనే అవసరం నాకేమీ కనుపించలేదు.’

హఠాత్తుగా, అనుకోని జవాబు పొందటంతో నేనేమీ మాటాడకుండా గదిలోనికి పోయాను. ఏమీ తోచనందున కొంతసేపు అలా నిలుచున్నాను.

బెడ్డింగు, చీపురు చేతపట్టుకొని డాబామీదకు పోవాలని బయలుదేరాను.

'మీరు చెయ్యరాని పని యిప్పుడు చెయ్యబోతున్నారు. నే నేదో తృప్తిపడతా ననుకోగలరు. ఇదిగో యిప్పుడే వస్తున్నా'అంటూ భోజనం పూర్తి కాకుండానే సుగుణ లేచిపోయింది. నా చేతిలోని చీపురు, చంకనున్న బెడ్డింగు పట్టుకొని మెట్లవేపు నడచింది. నా కిదంతా అయోమయంగా వుంది. యీ రోజు. సుగుణలో నిముషనిముషానికీ యేదో మార్పు నా కళ్లకి కనిపిస్తూనేవుంది. నే నిన్నాళ్లూ ఆమెను సుందరభవనాల్లోని సౌందర్యదేవతగాను, శాంతం, సహనం, దయాదాక్షిణ్యాలతో వర్ధిల్లుతున్న ఒక గంధర్వాంగనగానూ తలచి మురిసిపోయాను.

యీరోజు ఆమెనడతలో అటువంటి గుణాలన్నీ మాయమయిపోయాయి. అయినా ఆమెను యిన్నాళ్లకంటే యెందుకో అధికంగా ప్రేమిస్తున్నాను.

ఆమెలో యీ మార్పు ఒక్కసారిగా వచ్చిందంటే నమ్మలేను. అగ్నిపర్వతం ఆగిఆగి ఒక్కసారి బ్రద్దలైందని వూహించాను. కర్తవ్యం? అలా నిలుచుండగానే మనసు పరిపరివిధాలుగా పోయింది. నేను సుగుణను అడిగితే చెప్పదు. అడిగి ఆత్మాభిమానం కాల్చుకోవటం కష్టంగా తోచింది. నేను యే నిర్ధారణకూ రాకుండానే సుగుణ డాబా దిగిపోయింది. యీసారి మాటాడుతుందేమో అనుకున్నాను. అటువంటి దేమీ జరగలేదు. నే నక్కడ నిలుచోవటం, సుగుణ తన పని చేసుకోవటం నా కేదో అవమానంగా తోచింది. గబగబ మెట్లు ఎగబ్రాకాను.

పరుపుమీద వ్రాలి వినీలాకాశంవేపు చూస్తున్నాను. చుక్క తెగింది! నామీదే పడుతుం దనిపించింది!! కాని త్రోవలోనే మాయమై పోయింది!!!

పడుకొనే తలగడపై ఆన్చిన రెండు చేతుల మీద తల పెట్టి తూరుపువేపు చూస్తున్నాను. మా యింటికి యెదురుగా కనిపిస్తున్న మెట్టమీది సత్యనారాయణస్వామికోవెల—రెండు వేపుల పెద్ద చింత చెట్లు, చింతచెట్లమీదుగా చల్లని చందమామ— నా దృష్టి ఒక్కసారిగా కోవెలశిఖరంమీదకు పోయింది. ఏవో పావురాలు యెగురుతున్నట్లు కనిపించింది. ఆ కలకలలు విన్నట్లు భ్రమపడ్డాను. కొంత సేపటికి నా హృదయం తెలుసుకోలేని మత్తుపదార్థంతో నిండిపోయింది. అలా అర్ధనిమీలితనేత్రాలతో గుడి శిఖరాన్ని చూస్తున్నానేగాని మనసులో యెవరినో ప్రార్థిస్తున్నాను. యేమని ప్రార్థిస్తున్నానో చెప్పలేను. అయినా పేర్లుపెట్టి పొగడలేదు. కాళ్లు చేతులు వున్నవానిగా వూహించలేదు. ఆ కొద్దినిమిషాలూ నా మనస్సు యెంతో నైర్మల్యంతో తొణికిసలాడిం దని తరవాత గ్రహించాను.

సుగుణ మామూలుగా కాకుండా కాస్త దూరంగా ప్రక్క వేసుకుంది. నా దృష్టి ఆమెమీద వుండవలసింది. నిజానికి లేదు. నా మనసు మళ్లీ ఆ ప్రశాంతతకోసం ప్రాకులాడింది. యీసారి కూర్చున్నాను.

సుగుణకూడ లేచి కూర్చున్నట్లు గమనించాను. నేను ఎంత ప్రయత్నించినా అంతా నటనలా వుంది. తల మరింత కంగారుతో నిండిపోయింది.

సుగుణ వేసిన ప్రశ్నను నా చెవులు రిక్కించి విన్నాయ్—'పని చేసుకొనే సామర్థ్యం లేక దేవుని మీద భారం వేస్తున్నారా కళ్లుమూసి?'

'లేదు. నాకోసం అయితే దేవునిదగ్గరకు వెళ్లఖ్ఖర్లేదు. నా సత్తువ నాకు తెలుసు. ఎదుటివారి సత్తువ నాకు తెలీదుకాబట్టి భారం వేస్తే వేస్తాను' నా యీ సమాధానం నసుగుకోకుండానే వచ్చింది.

'వేస్తే వేస్తాను కాదు—వేస్తారా?'

'ఊఁ. వేస్తాను'

'సరే, ఆ పని మీరు చెయ్యఖ్ఖర్లేదు. అయినా ఎదుటివారికోసం మీ ప్రార్థనలో నిజానికి స్వలాభం తొంగిచూస్తూనేవుంటుంది. యీ శతాబ్దంలో ప్రార్థనలతో ప్రపంచకళ్యాణాన్ని సాధించిన మహానుభావులు లేరు.'

'పొరపడుతున్నావ్. ఉన్నారు. బాపూజీని తీసుకో'

సుగుణ ఒక్కసారిగా వెకిలినవ్వు నవ్వింది. నా శరీరమంతా జిరజిరలాడింది.

"లేదు. బాపూజీ ప్రార్థనలు మనసు నిర్మలంగా వుండటంకోసం చేశారు. ఆయన క్రియలతోనే ప్రపంచకళ్యాణానికి పాటుపడ్డారు'

నే నేమీ మాటాడలేకపోయాను. నా మనస్సును మథిస్తుంటే సుగుణ చెప్పింది నాకు నగ్నసత్యంగానే గోచరించింది. నేను 'ప్రపంచశాంతిని నెలకొల్పు ప్రభూ' అని ప్రార్థించేటప్పుడు నా మనస్సులో యింకొక నమ్మిక లీలగా తాండవమాడేది, ఎదుటివారి బాగు కోరేవాడు తప్పక బాగుపడతాడని. నేను ప్రపంచ శాంతిని కోరటంలో స్వలాభం లేకపోలేదు. ఇప్పుడు సుగుణ ! నా హృదయాన్ని మరీ దగ్గరగా చేర్చుకుంది.

నా మౌనాన్ని ఆమె యింకోవిధంగా తీసుకుంటుందేమో అన్న అనుమానం మళ్లా మాట్లాడించింది. యీసారి నా ప్రశ్నకు ఆమె జబాబీయలేదు. అడగకూడదన్న ప్రశ్న తొట్రుపాటులో అడిగినందుకు నా దౌర్బల్యానికి సిగ్గుపడవలసివచ్చింది. సుగుణ యీవేళ యిలా మారటానికి కారణం నే నెందు కడిగాను ? నిజానికి ఆమెలోని యీ మార్పే బాగుంది. యిన్నాళ్లూ సౌందర్యోపాసనలో యిలాంటి అనుభవాలకు తావే లేకపోయింది. ఏడుపులో యేదో ప్రశాంతి వుంటుందని అనుకోలే దెప్పుడూనూ. వాస్తవికజీవితానికి యీ మార్పు యెంతో అనుకూలిస్తుం దని సంతోషించాను.

అప్పటిలో కళ్లుమూసుకొని నిద్రపోవటం మంచిదనిపించింది. ప్రయత్నం అధికం అవసరంలేకుండా నే నిద్రపోయాను.

౨

నాకు తెలివివచ్చేసరికి యింకా ఆకాశాన నక్షత్రాలు మిణుగురుల్లా మెరుస్తున్నయ్. చల్లని గాలి వెల్లువ వీచింది. నా శరీరమంతా ఒక్కసారి పులకరించింది. చందురుడు పడమట వున్నాడు. వెన్నెల పాలవెన్నెలలా లేదు. అయినా చందమామ వేపు చూస్తున్నాను.

పున్నమచంద్రునిలోనే అంద ముందా ? విదియ చందురుని చూచి ఒళ్లు పులకరించదా ? జీవితంకూడ అంతే అనిపించింది. మనిషి బాలచంద్రునిలా వృద్ధిఅవుతాడు. యౌవ్వనంలో ఒక్కసారి పసిడిరంగులు వెలిగ్రక్కుతాడు. మళ్లీ కృష్ణపక్షపు చంద్రునిలా మెల్లగా కృశించిపోతాడు. ముసలివా డయ్యేసరికి మళ్లా బాల్యచేష్టలే చేస్తాడు. కాని యీసారి యెదురయ్యేది అమావాస్య. అంతే...

నా ఆలోచనాప్రవాహాన్ని అరికట్టడానికి నే ప్రయత్నించలేదు. ప్రయత్నించింది సుగుణ.

'మీకు తెలీదు' అంది.

నే నొక్కసారిగా ప్రక్కకు చూశాను. సుగుణ నాదగ్గరగానే కూర్చొనివుంది. నేను లేవటానికి ప్రయత్నించానుకాని ఆమెకుడిచెయ్యి నా ఫాలభాగాన్ని తాకింది. నా సమ్మోహనరూపవతి సుగుణ వేపు అలా కళ్లుఅప్పచెప్పి చూడటంతప్ప యింకేమీ చేయలేకపోయాను.

'మిమ్మల్ని కష్టపెట్టటం నా కిష్టం లేదు. ఎంచేత అంటారేమో ?'

ఆమె హఠాత్తుగా ఆగిపోయింది. ఏ ఆలోచనో ఆమె నలా చేసివుండవచ్చు.

'నిజానికి నాకు చెప్పాలని లేదు' అంటూ నా ముఖంవేపు తేరి చూచింది. నాలో ఆతృత గమనించిందేమో...

'నే ననుకు నేదాన్ని—మగవాళ్లకంటే ఆడవాళ్లేమాత్రమూ వెనుకపడలే దని. కాని వెనుకపడ్డారని యిప్పుడు తెలుసుకున్నాను. ఎంచేతంటే, యీ నీరు వాళ్ల కళ్లల్లో హెచ్చుగా వూరిపోతుంది.'

ఆమె చెప్పేదంతా వినాలని మరే ప్రశ్నలూ వెయ్యరాదని అనుకున్నానుగాని ఆమె నా సమాధానాలను కాంక్షించి నిరాశజెందుతున్నట్లు గుర్తించాను.

'సంసారిణి యింకెవరి బాగుకోసమో ప్రాకులాడుతుం దంటే నమ్మకండి. సంసారిణికాబట్టే నాలో

స్వార్థంవుంది. అలా అని పరులది నాదీ అనిపించుకోవటం నాకు సుతరాం యిష్టం లేదు."

'ఉఁ' అన్నాను.

'నే నిన్ని గంటలు యేడుపు, చిరాకు, కోపం అన్నిటికీ యెందుకు లొంగిపోయా నంటారు ?'

'యేమో ?' అన్న నా యెదురుప్రశ్నకు 'యేమీ లేదు. మానసికంగా బలం లేని మనుషులను చూస్తే నాకు జాలివేస్తుంది. ధైర్యంగా యెన్నో మాటలు వాగా లనిపిస్తుంది. తీరా నావరకు వచ్చేసరికి ఆదర్శాలకీ నా చేష్టలకీ సంఘర్షణ జరుగుతుంది. దాని ఫలితమే యిదంతానూ'

'అమ్మయ్యా' అని ఒక పెద్ద నిట్టూర్పు విడిచాను. నామీది బరువంతా దిగిపోయిన ట్లుంది.

'స్వయంకృతాపరాధం కాదు. మీ తప్పునే ఒప్పుగా భావించా లనే ప్రయత్నం' యీ గంభీరమైన సుగుణమాటలు మళ్లీ నన్ను మొదటి అవస్థలోనికి యీడ్చుకపోయాయి.

'మీ కాశ్చర్యంగా వుంటుందేమో నేను సెక్సు మీద కొన్ని పుస్తకాలు చదివానంటే. ఆ చదువువల్ల నేను బాగుపడింది లేదు, పాడయిందీ లేదు. కాలం వృథా చేసుకొని బాధపడ్డాను.'

సుగుణ మరల నిశ్చింతగా చెప్పుకొనిపోతోంది. 'కాలేజీలో నామీద రాతలు రాసినవారు నిజానికి వాళ్ల దృష్టిలో నన్ను ప్రేమించినవారే. వాళ్లకి ప్రేమంటే యేమిటో తెలీ దనుకుంటాను. ఇదే ప్రేమ అనుకొని ప్రేమించారు. ప్రేమించటం తెలియని మనిషిని యెలా ప్రేమిస్తాను? ప్రశాంతశాంతినికేతాలకి ప్రతిసీమా నోచుకోలేదు.'

ఆమెమాటలు రానురాను ఉద్రేకానికి దరిచేరుతున్నయ్. 'కాలేజీ విడిచిపెట్టాను. ఎవరో అన్నారట: భగ్నహృదయ—విరహతాపం భరించలేక విడిచిపెట్టిం దని. నేను యెవరినీ ప్రేమించలే దనను. భగ్నహృదయను కాలేదు. విరహతాపం పొందనూ లేదు.'

సుగుణ నా మోమువేపు జాలిగా చూసిం దనుకున్నాను.

'నేను ప్రేమించాను. ప్రేమంటే ముద్దులు, ఒళ్లువిరుపులు, నగ్నసౌందర్యా లని నే నెప్పుడూ అనుకోలేదు. అంచేతనే ఆ సెక్సు అంటే అసహ్యంవేసింది. మన శరీరంలో చల్లని రక్తం లేదు. వేడిదే వుంది. అనవసరంగా పొంగించి అలసటజెందఖ్ఖరలేదు. మనకు గుండె లే దని యెవరూ కబుర్లు చెప్పఖ్ఖరలేదు. మేమేమీ బానిసలం కాం వాళ్లు యెత్తిపొడవటానికి. మాకు నీతినియమా లున్నయ్. మాలో శాంతిసహనా లున్నయ్. మేము మా ఆచారవ్యవహారాల మధ్య పొందిన ఆనందంకంటె మరేఆడదీ హెచ్చు పొందలేదు.'

తక్కున, అనుకోకుండా అడ్డొచ్చాను— 'సుగుణా! ఇలా మారిపోతున్నా వేం ?'

'నే నేమీ మారలేదు స్త్రీహృదయం అంటే యేమిటో మీకు నచ్చచెప్ప ప్రయత్నిస్తున్నాను. నిజానికి మీకే అణిగున్నా రని చెప్పబోతున్నాను'

'నాకు చెప్పఖ్ఖర్లేదు. నేను స్త్రీని గౌరవిస్తాను' అని నేను మాటలు నమిలాను.

'మీరు గౌరవించలే దనే చెప్పబోతున్నాను. మిమ్మల్ని మేం గౌరవిస్తాం. మీ చెడుతిరుగుళ్ని మా హృదయంలో మూలక్కుండా పాతిపెట్టేస్తాం. మీ అపకారాన్ని వుపకారంగా తీసుకుంటాం. మీరు పెట్టిన కష్టాలతో మా మనస్సును మీకు మరీ దగ్గరగా చేరుస్తాం. మండే మంటలో ఆజ్యం పోయం. చల్లని నీరు పోసి చల్లారుస్తాం. చివరకు మేం కాంక్షించేది కలకాలం కాదు—జన్మజన్మాలకూ నిలిచిన కృతజ్ఞత. యీ దృష్టి నాకు లేకపోతే యీ దేశంలో యీ జన్మ యెత్తఖ్ఖర్లేదు.'

సుగుణ కాస్సేపు ఆగింది. నాకు ఆమెమాటలు వినాలని కుతూహలం హెచ్చుతోంది.

'నేను ప్రేమించా నన్నాను—ఆ మనిషి యీ వూళ్లోనే వున్నాడు. ఎప్పుడైనా ఎదురైతే చూపిస్తాను. మీరు చూసి అందంగా వున్నా డే అనుకుంటారు గాని మళ్లీ మీలో అసహనం రగుల్కొంటుంది. మీ అందంగురించి ఆలోచించుకుంటారు. వాడి అందం చూసి నేను ప్రేమించా ననుకోకండి.'

'అహాఁ'

'కాలేజీలో నాకు కొన్ని వుత్తరాలు అందాయి. అవన్నీ చింపా లన్నంత కోపం వచ్చింది. కాని, ఆ వుత్తరాలు వుంచాను. ఉత్తరం వచ్చిన మరునాడు ఆ వ్రాసిన మనిషి వేపు తేరి చూచేదాన్ని. ఎందుకా సిగ్గు ఆ వెర్రివెంగళాయికి? ఉత్తరం వ్రాసేటప్పుడు లేదూ ఆ సిగ్గు? ఆ వుత్తరా లన్నీ యేం చేశానంటారు?'

'ప్రిన్సిపాలుకు చూపించావా?'

'అంత తెలివితక్కువదాన్ని కాను. ప్రతివుత్తరానికీ ఒక కాగితం గుచ్చి 'నీకు ప్రేమకి అర్థం తెలీదు. యెలా ప్రేమిస్తాను? నివ్వు నాకోసం చదువు మానుకొని కాబోయే గుమస్తాగిరో, ఆఫీసరుపదవో వదులుకోకు. నీ అక్కయ్యదగ్గరకు వెళ్ళి 'నన్ను ప్రేమిస్తున్నావా?' అని అడుగు. ఆమె యే మనసుతో యేం సమాధానం యిచ్చిందో నేనూ ఆ మనసుతో ఆ సమాధానమే యిచ్చా ననుకో.' నా యీ జవాబుతో వాళ్ళ వుత్తరాలు వాళ్ళకు భద్రంగా చేరుకున్నయ్'

'చాలా తెలివైన పని చేశావే' అన్నాను.

సుగుణ మళ్ళీ మధుపూరితకంఠస్వరంతో మొదలు పెట్టింది. 'వేకువజా మిప్పుడు. ఇలాంటి మాటలు యిప్పుడు ఆడుకోవటం బాగుండకపోవచ్చు. కాని మనం వుల్లాసంగా వున్నాం. యీ వాతావరణం అలాంటిది. యీ మనసులు అలాంటివి. యిన్నాళ్లూ మీతో చెప్పకపోవటానికి కారణం లేకపోలేదు. యీ వేళ మీరు మనిషిలా వున్నారు. మనిషికి వుండవలసిన కోపతాపాలే కావు—వాటిని మాయంచేసే శాంతిసహనాలు, కనికరం మీ దగ్గర వుంది. యీనాడు మీరు నా కండలని ప్రేమించలేదు. నా మనసుని ప్రేమిస్తున్నారు. ఇదే చెప్పటానికి మంచి సమయం.'

నా సుగుణ నన్ను ఏటవాలుగా లేని మెట్లు ఎక్కుస్తున్న ట్లనిపించింది. నాలో నీరసం నేను సరిగ్గా కనుక్కో లేకపోయాను. నోరు విప్పి చెవులు రిక్కించి వినటంతప్ప ఆ మాటల ప్రవాహానికి అడ్డంకు పెట్టలేకపోయాను.

'కాలేజీలో ఒక విద్యార్థిని చూశాను. ఆయనే అందంగా వుంటా డన్నాను. అయితే ఆ అందాన్ని చూసి నేను ప్రేమించివుంటే కాలేజీ విడిచిపెట్టఖల్లేదు. ఆ మరుచటిసంవత్సరం అంతకంటే అందగాడు కనిపిస్తాడు. ఆయనకష్టాలే నా మనసును దోచివేశాయ్. తన చదువు, తన గొడవే—మంచి బట్టలు వేసుకున్న పాపాన పోలేదు. తరవాత ఆయనవిషయం చాలావరకు తెలిసింది. చాలా పేదయింటి అబ్బాయి; వాళ్ళనీ వీళ్ళనీ ఆశ్రయించి యెలాగో కాలం గడుపుతున్నాడని. నేను చూపించింది సానుభూతి.

ఒకనాడు విశ్రాంతికాలములో కాలేజీలోని మా గదిలో పిచ్చాపాటీ మాటాడుకుంటున్నాం. ఆయన గబగబ గదిలోనికి వచ్చారు. యీ యిరవైమంది ఆయనవేపే చూస్తున్నాం. నేనుమాత్రం ముందుకు నడచి 'యేం కావాలండీ' అని ప్రశ్నించాను.

'క్షమించండి. మీదగ్గర బోటనీటెక్స్టుబుక్స్ రెండు వున్నాయట. నా కొకటి యిస్తే కోర్సు అయిపోయాక యిచ్చివేస్తాను'

మా బృందంఅంతా ఫక్కుమని ఒక్కసారి నవ్వారు. వాళ్ల నవ్వుకు నా తల తిరిగిపోయింది. ఆయనమాటలు నా చెవుల్లో యెన్నిసార్లు గింగురుమన్నా అసభ్యమైన మాట యేదీ కనిపించలేదు.

నా దృష్టి కిటికీవైపుకు పోయింది. వరండాలో కొందరు మావేపు చూస్తూ నవ్వటం గమనించాను. శ్రమపడకుండానే యేమైందో వూహించుకున్నాను. యీ నాటకానికి సూత్రధారిగా యీ అమాయకుడ్ని తీసుకున్న యీ భావిభారతభాగ్యోదయుల్ని యెలా స్తుతించటమో తోచిందికాదు. పాపం! దృష్టి నేల కప్పగించిన ఆయన చూడటంతో నా మనసు సంబాళించుకపోయి 'రేపు తప్పకుండా తెచ్చి నేనే యిస్తాను. మీరు రాఅఖ్ఖర్లేదు!'

ఆయన నమస్కరించి వెళ్లాడు. నా కెందుకో కష్ట మనిపించింది'

'ఉఁ. తరవాత' అన్నాను క్లుప్తంగా.

'ఆరోజు సాయంత్రం ఒక పుస్తకం కొని ఆమరుచటిరోజు నేనే ఆయనదగ్గరగా వెళ్లి మరీ యిచ్చాను. యిచ్చి వెంటనే తల దించుకరాలేదు. చుట్టూ వున్న వాళ్ల ముఖాలవేపు చూసిమరీ వచ్చాను.

'పైలట్' అని యెవరో గొణుక్కున్నాడు. నా కంత గౌరవంచేసిన ఘను డెవడో పోల్చుకో లేక పోయాను.

మీ కిక్కడ నే చెప్పదలచిన విషయం ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. ఆ మూడవరోజు మాసిన బట్టలు లేవు. కమీజు ఫేంటులో దోపి, కాబూలీ శాండల్స్ వేశాడు. చాలాసేపు ఆయనవేపు చూడకుండా వుండలేకపోయాను. కాస్త చిరునగవుతో తల దించాడు. యీ వేషంకంటె ఆ ముందురోజు బంగాళీ పట్టుతో బాగా కనిపించాడు. అసలు యీ గుడ్డలలో యే ప్రశాంతతా కనిపించలేదు. ఆ ముందురోజు ఆ గుడ్డల మధ్య నేనేదో తెలుసుకోలేని ఆనందాన్ని పొందాను. ఆయనవేపు పరీక్షదృష్టితో చూడటం మానలేదు. ఆయనతో మాటాడా లని మనసుపడింది. కాలేజీ విడిచిపెట్టాక మాటాడుదా మనుకున్నానుగాని వీలైంది కాదు. కాలేజీనుంచి పోతుంటే త్రోవలో తారసిల్లాడు.

‘ఏమండీ’ అన్నాడు ఆయనే. రెండు చేతులు జోడిస్తే చూడాలని నా కళ్లు యెదురుచూశాయ్. అటువంటి దేమీ లేకపోవటంవలన నేనే ‘నమస్కారం’ అన్నాను. ప్రతిగా ‘నమస్తే’ అంటూ తేల్చేశాడు.

‘బీచికి వస్తారా’ అన్నాడు.

‘ఎందుకు?’ అన్నాను.

‘అందరూ చల్లగాలికేనా వెళ్తారు?’

‘రావటానికి నా కేమీ అభ్యంతరం లేదు. యీ వేళ కాస్త పనుంది. రేపు శెలవుగా! తప్పకుండా వస్తాను. మీ రెక్కడుంటారు?’

‘స్కాండల్ పోయింట్ దగ్గర.’

‘చాలాదూరం. అగ్రహారం బీచిలో.’

‘అక్కడే చాలా బాగుంటుంది.’

‘సరే! ఐదున్నరకల్లా వస్తాను.’

వెళ్లిపోయాడు. ఆ మరుచటిరోజు సాయంత్రం వెళ్లలేకపోయాను. మా నాన్నమ్మకు గాబరాచేసింది. డాక్టరు రావటం ఆ హడావుడిలో వుండిపోయాను. ఆ రాత్రే, రానందుకు కారణం వ్రాస్తూ క్షమించమని వుత్తరం వ్రాసి ఆ మరుచటిరోజు యిచ్చాను.

ఆయన తెలివితక్కువ ఆయనే కనుక్కోవాలని నా వుద్దేశం. ఆ పనికి నీతులతో కాదు, నా చేష్టలతో యేమైనా సహాయం చెయ్యగలనేమో అని చూశాను. అంతవరకు ఆయన ఆగలేదు. ఆగే తత్వమని పొరపడ్డాను. నా వుత్తరానికి జబాబు వ్రాశాడు. నిజానికి ఆ వుత్తరం అనవసరం. పోనీ, ఆ వుత్తరం యిదివరకు పుస్తకంకోసం వచ్చేటప్పటిలా యే కుళ్లూ లేకుండా వచ్చి చేతికి అందించివుంటే అందులో వెర్రిరాతలున్నా ఆయనధైర్యానికీ, నిజాయితీకీ మెచ్చుకొనివుండేదాన్ని. పోస్టులో పంపించాడు. అందులో బాహాటంగా లేకపోయినా ప్రేమని గూఢార్థంగా జోడించాడు.

ఆయన యింకొకలా వుద్దేశపడివుండవచ్చు. మగవాడు దిట్టంగా వుంటే ఆడది వాడి వెనకాలే పడి గాపులుకాసి తిరుగుతుం దని అనుకొనివుండవచ్చు. ఆ వుద్దేశంతో ఆ వారం రోజులలో గాంభీర్యం చూపించాడు. లోపల లొసుగు వుంచుకొని పైకి మేకపోతుగాంభీర్యం చూపిస్తే తెలివైన యే ఆడదీ పడి గాపులుగాస్తుం దనుకోను. ఆయనమనసు నిర్మలంగా దిట్టంగా వుంటే నేను మీ భార్యను కాకపోదును. ఆయన పెళ్లాడటమో...’

‘లేక విషం త్రాగి చచ్చిపోదువా?’ నా యీ ప్రశ్నకు ఆమె నిశ్చింతగా జబాబిచ్చింది:

‘ఛీ! అంతపని చేసే పిరికిపందను కాను. జీవితంవిలువ నాకు తెలుసు. యీ ప్రాణంకోసం యెందరెలా తాపత్రయపడతారు? కొంటే దొరకని ప్రాణాన్ని ఖూనీ చేసేయమంటారా? నాకు తెలుసు —ప్రపంచం అంతా కామంతోనూ మోహంతో నే లే దని.’

‘అయితే సన్యాసిని నైపోవుదువా?’ నాకంఠ ధ్వని పరిహసించినట్లుంది.

‘సన్యాసిని అయిపోయి వూరూరా బిచ్చమెత్తుకొని కడుపునింపుకోవట మనేనా? మీ రలాగే అనుకొనివుంటారు. అయితే, కాను. నా కడుపుకోసం యింకొకరిని బాధించటం నా కిష్టం లేదు. కష్టించేవాళ్లకు కూడు లే దనుకోను.’

నే నడ్డుతగిలాను యీ రోజులు తీసుకోమని. సుగుణ అంది—‘సహనంతో గంజి త్రాగిన యే కూలివాడూ చచ్చిపోలే దని నా నమ్మకం. అసహనంతో అన్నం తిన్నవాడే చనిపోయివుంటాడు. దానికి ఏ ప్రభుత్వం, యే వ్యక్తీ బాధ్యులు కారు. ఎవరికి వారే!’

యీ వేదాంతం నా కేమీ నచ్చలేదు. యీ విషయాన్ని నే నంగీకరించలేనని చెప్పాను. ‘నీ విషయమే తీసుకో. కష్టపడేది నేనేనా? నువ్వు కూర్చొని

తినటంలేదూ ? ఆడవాళ్లలాగే అదృష్టవంతులు పెట్టి పుట్టారు !'

ఆమె మందహాసంతో నావేపు కనికరంగా చూసింది. నే నేమీ మాటాడలేదు.

'మీ తప్పు దిద్దుకుంటా రని కాస్సేపు ఆగాను' అంది.

'తప్పుంటేగా దిద్దుకోడానికి ?'

'కూర్చొని తిన్నవాళ్లు మేమూ స్వతంత్రుల మని బోరవిడిచి పైకి రమ్మనమనండి'

'నిజానికి వాళ్లే బోరవిరుచుకొని పైకి వస్తున్నారు. కష్టించేవాడు క్రిందికే అణగారిపోతున్నాడు'

'అయితే సిగ్గుచేటు. వాళ్లకి సిగ్గూ బిడియం లేకపోవచ్చు. వాళ్లని స్వతంత్రులుగా మనం గుర్తించటం మనకే ఆ సిగ్గుచేటు.

'విధి లేదు. విప్లవం లేవదీయమంటావా?'

'అలా అనుకోవటం పశుత్వం. విప్లవం లేవదీసి యెవరిని చంపుతారు ? ఎవరి రక్తపుటేరులలో కాళ్లు కడుక్కుంటారు ? పులి కళ్లు కనపడక తన పిల్లలనే కబళిస్తుంది, పాపం! మనకు కళ్లుండికూడ ఆ పని చేయటం ఘోరం. అలాంటప్పుడు మనం జంతువుల్లో అగ్రజాతని విర్రవీగటం యెందుకు ?'

'అయితే నీ వుద్దేశం ?'

'మీ పీక కోసుకొని మీ రక్తంతో మీరే అభిషేకం చేసుకోవద్దు. యిలాంటివి పరిష్కరించడానికి శతఘ్నులతో శంఖం పూరించఖ్ఖర్లేదు. శవాలతో నైవేద్యం పెట్టఖ్ఖర్లేదు. పూరించి నైవేద్యం పెట్టాక చూడలేక ఒక్కసారి ఒళ్లు ఝల్లుమని యెవడో యెత్తున వున్నాడని వెక్కివెక్కి యేడుస్తారు. ఆయన మన గోల వినడేవినడు. నిజానికి మీ గోల మీరుతప్ప యింకెవరూ వినరు. అంచేత తోకకి నిప్పంటించుకొని కోతుల్లా గెంతటం కాదు మన పని. విజ్ఞానాన్ని అలవరచుకొని సౌఖ్యంగా బ్రతకా లని తలచే రోజు లివి. పులిని జూచి నక్క వాతవేసుకున్నట్లు మన మెలా ఔతాం ? తనకు తోచినట్లు ఆలోచించుకోడానికి అందరికీ హక్కుడంటూ వుంది.'

సుగుణమాటలను వింటుంటే నా కెందుకో భయం వేసింది. ఆమెను ప్రశ్నలతో యిక బాధపెట్టకూడ దనుకున్నాను. తెల్లవారింది, తరవాత మాటాడుదామని చెప్పటానికి కూడ సంకోచించాను. నా ముఖం తూరుపువేపు తిరగటంతో ఆమె గప్పున లేచి 'తెల్లవారింది. పోదాం రండి' అంది. ఆ గంభీరవదనం మందహాసంతో నిండిపోయివుంది. సరే అంటూ నేనూ లేచాను. యీనాటికంటె నా సుగుణముఖం యింతకు ముందు అందంగా కనిపించినా యీనాడు నా సుగుణను చూచి పొందిన తృప్తి యీ మూడునెలల దాంపత్యజీవితంలో యెన్నడూ లేదు.

## 3

నే నిదివరకు యెప్పుడూ ఆడది నవ్వుతుంటే నే చూడా లని తహతహలాడేవాడిని. నా సుగుణను నవ్వించా లనే కోరికతో యెన్నో కట్టుకథలు, తమాషాలు చెప్పేవాణ్ని. సుగుణ నవ్వేది. నా ప్రతిభ చూసే యీ నవ్వని గర్వపడేవాడిని. ఆమె నిజస్వరూపం యీనాడు చూశాక నా అవివేకం జ్ఞప్తికి వచ్చి లజ్జాన్వితుడ నయ్యాను.

ఇప్పుడు ఆమె గంభీరవదన. ఆమెపై నా కిదివర కేదో అధికారం వుందనే భ్రమ మటుమాయమైంది. ఆమెను నాకు తెలియకుండానే గౌరవిస్తున్నాను. ఆమె నవ్వితే నాకు చూడా లని లేదు. ఆలోచిస్తుంటే ఆ వదనంలో మారే రంగులు చూడా లని నా కోరిక.

ఆరోజు నాకు ఆఫీసుకు వెళ్లా లని లేదు. ఆ మాటలు విందా మని వుంది. సుగుణ ఆడిన శృంగారమైన పలుకుల్లో కంటె విచారంగా ఆడినమాటలు, ఉద్రేకంగా విసరిన వాక్యాలు నా హృదయానికి హత్తుకున్నాయ్.

నా మనస్సంతా సుగుణకు జోహారు లర్పిస్తోంటే కాఫీకప్పుతో యెదురుగా నిలుచుంది. సుగుణచేతిలోని కప్పు తీసుకోలేదు. ఆమెవేపు దీక్షగా దీనంగా చూశాను. నా అనుభూతి వర్ణించుకోలేను. నా కళ్లల్లో నీరు చిమ్మిం దని తెలీదు. కప్పు టేబిలుమీద పెట్టి గప్పున చీరకొంగు అందుకుంది. కాని తుడవలేదు. ఆమెయెడమచేతిని నా భుజంమీద వేసింది. నా గొంతుక శోకమయ మైందని గుర్తించుకున్నాను. సుగుణ—నవ్వుతుందేమో—నవ్వలేదు—నాలా యేడుస్తుందేమో—ఏడవలేదు. మాటాడనూలేదు. బిక్కచచ్చి నా వేపు చూస్తున్న ట్లనిపించింది.

కాస్సేపటికిగాని తేరుకోలేకపోయాను. నా యీ ప్రవర్తన ఆమెను యింకోకలా తలచుకోడానికి అవకాశం యిచ్చిం దనుకున్నాను. నేను నా సుగుణను అనుమానించానా ? అందగాడు—ఎవరికి ? ఆమె

హృదయాన్ని అర్థంచేసుకోలేక యీర్ష్యచే కన్నీరు కారుస్తున్నానేమో అని అనుకోవచ్చు—అందుకే ఆమె కా తొట్రుపాటు—ఆందోళన. నా గొంతుక యిక యెంతసేపు పట్టుకపోలేదు. నా గౌరవాన్ని ఆమెకు యెలా యెరుకపరచటమో తోచలేదు.

'ఊఁ' అన్నాను. ఆమెకంటిరెప్పలు ఒక్కసారిగా కొట్టుకున్నయ్. మరల హీనస్వరంతో 'నిన్ను యెలా గౌరవించను? నీది చాలా పవిత్ర జీవితం' అన్నాను.

ఆమెలో మార్పు నన్ను సంభ్రమింపజేసింది. గబగబ నా కన్నీరు తుడిచి అలా నిలుచునే నా వక్షంపై తల ఆన్చిగాఢనిట్టూర్పులను విడుస్తోంది.

నెమ్మదిగా ఆమెతల నిమిరాను. సుగుణకుడి చేతితో నా యెడమచేతిని కలిపాను. అలా నిలుచునే ఆమెవ్రేలివుంగరంలో మెరుస్తున్న తెల్లని పొడివేపు చూస్తున్నాను. కాస్సేపటికి సుగుణ తెప్పరిల్లింది. అలా కళ్లు తెరిచే 'కాఫీ త్రాగండి' అంది. నే నేమీ మాటాడలేదు. సుగుణ మెల్లిగా పెరటికి వెళ్ళిపోయింది. నేను ఆమెవెనకాలే వెళ్లా లనుకొని నాలు గడుగులు వేసి మరీ ఆగిపోయి సుగుణవేపు చూస్తున్నాను.

నా కిప్పుడు సుగుణను మాట్లాడించటం అట్టే యిష్టంలేదు. ఆమెను బలవంతంచేసి చెప్పమంటే నే వినవలసిన దేమీ వుండదు. స్వేచ్ఛగా గడచిన రాత్రిలా ఆమె కుతూహలంగా చెప్పుకపోవాలి. యే ప్రశ్నలకూ అడ్డురాకుండా చెవులారా వినా లనుకున్నాను.

ఆఫీసుకు పోయాను. నా మనఃఫలకంమీద కాస్సేపు సంశయం కొట్టుకలాడింది. నే చేసిన అపరాధం యేదో నిర్ధారించుకోలేకపోయాను. సుగుణ ఆ తప్పును ఒప్పుగా తీసుకోడానికి ప్రయత్నించేటప్పుడు నేను బాధపడటం తెలివితక్కువగా తోచి మనసు ఆఫీసుపనిమీదికి మరల్చాను.

తలనింపుగా ఆఫీసుబరువు మోసుకొని యింటికి వచ్చేసరికి శృంగారించుకొని సుగుణ స్వాగతం యిచ్చింది. నా మనసు అమితోల్లాసంతో వుబికి 'ఇలా ప్రపంచంలో యెంద రాడవాళ్లు చేస్తా' రన్నాను. సుగుణ ఒక్క నవ్వునే సమాధానంగా పారేసింది.

ఆ వేళకూడ సముద్రతీరానికి వెళ్లాం. త్రోవలో సుగుణ నడుస్తూ యేదో దీర్ఘంగా ఆలోచిస్తోం దని గుర్తించి నే నేమీ మాటాడలేదు. నా తలలో వుదయం నా హృదయంపై తల పెట్టి నిట్టూర్పులతో నీరసపడ్డ సుగుణ తిరిగిపోతోంది. వేకువజామున అంత వుద్రేకంగా మాట్లాడి వుదయం యేడుగంటలకల్లా మన స్సంతా కరిగిపోయినట్లు సంచరించటం తలచుకొంటుంటే నా మనస్సంతా ఆమెసౌకుమార్యానికి జోహారు లర్పించింది.

మొదటిరోజులా యీ రోజుకూడ మౌనంగానే కూర్చున్నాం. యీ రోజుకూడ చెప్పుకోదగ్గ సంఘటనే జరిగింది. అప్పుడు నాలో నేనే వికృతంగా నవ్వుకున్నాను. ఉదయం జరిగిన సంఘటన నిజానికి సుగుణమీద జాలిని ప్రబలింపజేసింది. అది అలా తలలో ముళ్లు వేసుకొని వుండటంవలన యెంతో ఆప్యాయంగా—

'సుగుణా నే నంత తెలివితక్కువవాణ్ని కాను' అన్నాను.

విడిచిన పుష్పంలా వున్న సుగుణముఖం మారిపోయినట్లు ఆ మసకచీకటిలో లీలగా గుర్తించాను. హృదయాంతరాళంలో జొచ్చిన అనుభూతి, వీచే పవనాల తాకిడికి నే పొందిన హాయి—ఒక్కసారిగా ఆమె 'ఏమో' అన్న ప్రశ్నకు—

'ఉదయం పాపం! నా ఆనందబాష్పాలని చూసి ని వ్వింకొకలా తీసుకున్నావుకదూ?'

ఆమె వెకిలిగా వెలుగులేని నవ్వు నవ్వింది.

'హాఁ. నాది పవిత్రజీవితం. యీనాటికి మీరు గుర్తించారా!'

నే నేమీ జబాబీయలేకపోయాను. మాటలు దొరకక్క.

'చూశారా! యీ సాగరం అవతలి ఒడ్డు చూడగలరూ? యీ ప్రకృతితో యెప్పుడూ బాసలాడుకొనేవుంటారా? జీవితం అవతలి ఒడ్డు చూడాలని నే నెప్పుడూ ప్రయత్నించను. యేదైతే చూడగలనో అక్కే చూస్తాను. ఎవరితో మాట్లాడితే ప్రయోజనమే వాళ్లతో నే మాట్లాడుతాను. చెట్లతో మాటాడితే నా కేం వస్తుంది? నా మాటలు వింటుందా ఆ చెట్టు?'

సుగుణవేపు చూడలేదు. నా మన స్సెందుకో గగ్గోలుపడటంచేత ఆమె మధురసిక్తమైనమాటలు మళ్లీ చెప్పుకపోతున్నా యేదో వింటున్నాను.

'మన కత్తో, మన తుపాకో మన ఆహారంకోసం వాటి గుండెల్లో నాటుతాయా ? దినదినగండంతో ఆ సాధుజంతువులే బ్రతుకుతున్నప్పుడు మనం బ్రతక లేమా యీ లోకంలో? నా కెప్పుడూ ముందుకు యెలా బ్రతుకుతా మనే పిరికితనం లేదు. యిప్పుడు మీ భార్య నవటంవలన మీ డబ్బు నే నేమీ వూరికే తిన లేదు. నా కష్టంచూసి కడుపుకు తిండి పెట్టున్నారు. నా రాట్నం నాకు బట్ట లిస్తోంది. ఆడవాళ్లని మీ రనుకున్న అదృష్టవంతులతో పోల్చటం బాగా లేదు'.

నా పెదిమలు బిగబట్టుకున్నాయ్. లేవా లను కున్నానుగాని కాళ్లు బంధించుకపోయాయి. నా ఆత్మాభిమానం సుగుణమాటలను సంతోషంగా స్వీక రించనీయలేదు.

సుగుణ నా భుజంమీద చేయి వేసి మెల్లగా నిమిరింది. ఆ లాలన నా హృదయం గిలిగింతలు, దాగు డుమూతలతో నిండిపోయింది.

'స్త్రీ—మీకు తల్లై, భార్యయై చూపించ గలిగేది యిదే'

నా ఆత్మలో అనిర్వచనీయమైన ఆనందం వూగులాడింది. 'ఒకనాడు ఒక వ్యక్తికళ్లల్లో ఉదయం చూసిన నీరే చూశాను. అప్పుడు అలాంటి అనుభూతే పొందాను. కాని అప్పట్లో ఆయనగుండెమీద చెవి పెట్టి నిద్రపోలేకపోయాను.'

ఎవ రా వ్యక్తి? నే నెప్పుడూ అలా కళ్లల్లో నీరు నింపలేదే. ఎవరు ?—ఇదే చెప్పకోదగ్గ సంఘ టన. అందుకే నేను వికృతంగా నవ్వుకున్నట్లు జ్ఞాపకం.

ఆరాత్రి చాలా ఆలస్యంగా భోంచేశాం. నేను నిద్రపోటానికి యెంత ప్రయత్నించినా లాభం లేక పోయింది. చెప్పరానంత చిత్తసంక్షోభం నే నెందుకు పొందా లనే నా మనసులో సంబాలింపు నన్నలా చేసింది. యీసారి సుగుణదగ్గర యిదివరకులా కాకుండా ఆలోచించి మాట్లాడా లని అనుకున్నాను.

పరుపుమీద యిటూ అటూ కదులుతున్నాను. గాలికూడ లేదు. సుగుణ లేచి క్రిందికి వెళ్లటం గుర్తించలేదుకాని విసనకర్రతో చివరిమెట్టుమీదికి రావటం చూశాను.

సుగుణ నాదగ్గరగా కూర్చొని విసురుతోంది. గాజుల చప్పు డవుతోంది. నేను వెల్లకిలా పడుకొని విసనకర్రకోసం చెయ్యి చాపాను. ఆమె విసరటం ఆపి నవ్వుతూ అంది.

'మనిషి జయించలేనిది ఏమిటో చెప్పండి.'

'ఒక్క టేమిటి ఎన్నో వున్నయ్.'

'ఏమిటండోయ్ ?'

'కామ క్రోధలోభ మోహ మద మాత్సర్యా' లన్నాను వికారంగా.

'అబ్బే ! నే ననుకున్నదాని బానిస లివన్నీ'

'........................'

'అలా ఆలోచిస్తా రేమిటి ? మనసండీ —యేదీ మనసును జయించిన మొగాణ్ని చూపించండీ యీ రోజు ?'

'ఆడవాళ్లు మహాజయించినట్లు ? ముక్కు మూసి జపం చేసినట్లు ?'

'మేం జపం చెయ్యక్కర్లేదు. చేసినవారు మీరే. మహర్షులుకూడ మొదట మనసుకు లొంగి పోయినవారేనా ? మేం జపం చేసినా యెవరికోసం చేస్తాం ? పార్వతి పరమశివుని ప్రేమకోసం చేసింది. అంబ చేసింది ప్రేమ భగ్నమైతేనా ? ఆడవాళ్లం ప్రేమస్వరూపులం—కాకపోతే ఆనాడు పెళ్లిచూపు లకు వచ్చి నీటితో కళ్లని నింపిన మీకేసి చూసి నే నెందుకు అంత ప్రేమతో నిండిపోవాలి ?'

నాలో వుత్సాహం పొంగింది. నా వికృతపు నవ్వుకు నాలో సిగ్గు అలముకుంది. నామీద నాకే జాలివేసింది. ఆవేళ నేను చాలా నిరాశతోవున్నాను గాని నా కళ్లలో నీరు తిరగటం నేను గుర్తించలేదు. కాని సుగుణ గుర్తించింది. సుగుణ నా ప్రార్థనతో 'అయితే నిన్న యెంతవరకు విన్నారు ?'అని ప్రశ్నిం చింది.'ఎంతవరకేమిటి ? కాలేజీలమీద...ఆ అందగాడి మీద నీ మాటల ప్రవాహం.'

'నవ్వండి ఒక్కసారి'అని కుతూహలంగా నామీద చేయి వేసి గిలిగింతలు పెట్టింది. యీ వింత కోరికకే నాకు నవ్వాగిందికాదు.

'ఉఁ, గట్టిగా నవ్వండి'—నవ్వకుండా వుండ లేకపోయాను.

'ఇప్పుడు ఏడవండి—త్వరగా' ఏడుపుబదులు మరింత హెచ్చుగా నవ్వుతున్నాను.

'మీకు పుణ్యం వుంటుంది : గట్టిగా ఒక్కసారి

యేడవండి'—దీనంగా నామీద రెండు చేతులూ వేసి కుదిస్తోంది.

'సుగుణా! యేమిటిది? మతిగాని పోయిందా?' అంటూనే నవ్వాపుకోలేదు. నా నవ్వు ఆగేవరకూ వూరుకుంది.

'నా మాటలమీద మీ అభిప్రాయం?'

'అదంతా అరణ్యరోదనం అంటాను.'

'ఏ రోదనో ఒక రోదన అని ఒప్పుకుంటారా?'

'ఓ'

'అనవసరంగా ఏడవమంటే మీరు నవ్వారే గాని యేడవలేదే. నా కేం పట్టింది అనవసరంగా యేడవటానికి? నా కాలేజీలో నా యింట్లో నా అన్నయ్యదగ్గరలా మెసలాలని ప్రయత్నించాను. నా అన్నయ్యను చూసి తల దించుకొనే అవసరం నాకు లేదు. దూరంగా పోవక్కర్లేదు.'

'నిజం' అన్నాను.

'నిజంకాదు. అబద్ధం. యీ దేశపు కాలేజీల్లో తల దించుకోవాలి. దూరంగా పోవాలి. అప్పుడే ఆడది చాలా మంచి దని గుర్తిస్తారు మా విద్యార్థులు, విద్యాధికులు అంతా. సిగ్గే ఆడదాని సర్వస్వం అయితే సిగ్గుతోనే యే ఆనందం పొందకుండా చావటం మంచిది.'

'సుగుణా! సంఘం హిమవత్ శృంగం. దానిని ముట్టుకోకుండా కథ నడవనీ' అన్నాను.

'సంఘం! సంస్కరణే సంఘం! మీ చెడ్డలకు మీరే సంఘం. మీ రీ మాటలు హర్షించలేకపోతున్నారా? దొంగ నువ్వు దొంగంటే ఒప్పుకుంటాడా? సిగ్గుకూ మీ జీవితానికీ ఎంత సంబంధం వుంది!'

సుగుణచివరివాక్యంమీద వ్యాఖ్యానంకోసం నా మనసు సంక్షోభపడింది. నా నిశ్చేష్టత ఆమె యేమి చెప్తుందో విననీయలేదు.

'వింటున్నారా?' అంది.

'ఏమిటి?–ఆఁ'

'వినలేదు. మళ్లా చెప్తున్నా—ఆయన రెండు వారాలు పోయాక మళ్లీ ఆ మాసిన కమీజుతోనే కనిపించాడు. ఆవేళ ప్రొద్దున్నే మాయింటికి మా పెద్దమ్మ కొడుకు వచ్చాడు. ఆ మాసిన బట్టలు చూసి నా మనసు యెలా అయ్యిందో యీయనను కాలేజీలో చూడగానే ఆలాగే అయింది.

మా అన్నయ్య ఉద్యోగం సంపాదించుకోలేక అలా తయారయ్యాడు. ఆవేషాన్ని చూస్తే యెవరికైనా మనసు కరుగుతుంది. మాటలు వింటే కడుపు గోలతో వున్నది. యిక యీయన. ప్రేమ ఫలించక యిలా మళ్లీ తయారు. వేషాన్ని చూస్తే యెవరికైనా మనసు కరుగుతుంది. మనసు మథిస్తే ప్రేమోన్మాదది!

చేతకానితనం పీడిస్తే హింసకు పూనుకొని కార్యాన్ని సాధించటమే వీళ్ల సిద్ధాంతం. వాళ్లను చూసి కనికరించనవసరం లేదు. ఆత్మవిశ్వాసం లేనివారని వూరుకోవటం మంచిది. ఎదుర్కొవలసివస్తే ఆత్మవిశ్వాసంతో యెదుర్కొవటమే మేలు!'

౪

'ఏమిటో ఇలా చెప్పేశాను. యీ రెండు వారాల్లో జరిగిన విశేషాలు విడిచిపెట్టేశాను.'

'ఏమిటవి?'

'యీయన దొర్ల వేషానికి గులాం అయ్యాక కాలేజీలో ఆ విషయం రానురాను ఆలోచించలేదు. కాలేజీనుంచి పోతూ నామనసు అదుపులో వుంచుకోలేకపోయాను. యేదో తెలియక చేసివుంటాడు; ఇలా మారటంలో వుద్దేశం కనుక్కోవాలనిపించింది. నా చేతులతో తీసుకున్న నూలుకు నాపై యెంతభక్తి. కష్టపడకుండా ప్రకృతిసిద్ధంగా వచ్చింది నా అందం. కష్టపడి పొందింది నాచీర. నా అందం నా మనసు చేతిలో కీలుబొమ్మ. నా చీరకు అటువంటి విచారం లేదు'—

ఆ మాటలకు అడ్డు వచ్చి 'అసలు. కథ సాగనీ సుగుణా!' అన్నాను. నిశ్శబ్దం. తెల్లని మేఘాలు చందమామని కప్పుతుంటుంటే మామీద మసక తెర కప్పుకపోతోంది. ఆ తెరలో సుగుణముఖం నిగనిగలాడటం మానలేదు; మధురస్మృతులు ఆమోములో మెలికలు తిరిగి మెరుస్తున్నట్లుగా తోచింది.

ఒక్కసారి మందహాసం అలలులా పరుగెత్తింది. నే నందులో దారీ తెన్నూ తెలియక కొట్టుకపోయాను.

'ఆ స్త్రీలు యెంత తెలివైనవాళ్లు. వేలకొలది రాజుల్లో అనువైన భర్తని యెలా యెంచుకునేవారు? నా భర్తని నేను యెంచుకోడానికి యెంత కష్టపడ్డాను!'

సుగుణ మళ్లా మౌనాన్ని దాల్చింది. యీ ప్రవర్తన నాకు ఆశ్చర్యాన్ని కలిగించలేదు. అప్పుడే

మబ్బు విడిచిన వెన్నెల్లో నా సుగుణకళ్లల్లో జీవిత చిత్రాలు, పెదిమలపై ఆనందరాసులు చూశాను.

'మీరు నా కంటికి యెంత ఉన్నతంగా కనిపించారు! మీ మాటలు నా హృదయాన్ని ఎందుకు మధుసిక్తం చేశాయ్. మిమ్మల్ని చూసి నే నెందుకు మహదానందమూ తృప్తీ అనుభవించాను'

నేను సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయాను. వాడినిగురించి చెప్తూ నా ప్రసక్తి తేవటం నా కాశ్చర్యాన్ని కలిగించింది. సుగుణ నిమ్మళంగా, నిస్సంకోచంగా చెప్పుకపోతోంది.

'మీరు నా అందాన్ని చూసి ప్రేమించా రని వూహించటానికి కూడ ఆస్కారం యిచ్చారు కాదు. యీ మూడు నెలలూ మీతో గడిపాక మీ మనసు ఒకప్పుడు శృంగారంమీదే లగ్నం అయిం దని నిశ్చయానికి వచ్చాను. అయినా మీ కెందుకు గౌరవించగలిగానీ రోజుల్లో. నా మనసులో యింకా అప్పటి మనసే అతుక్కొని వుండిపోయింది. యిలా అతుక్కొని వుండిపోవటంవల్ల నేను తప్పు చెయ్యవలసివచ్చింది.

కాలేజీచదువంటే విసిగెత్తి స్వస్తిచెప్పాను. పెళ్లి చేసుకోవా లని వున్నా వచ్చే సంబంధాలను చూసి వెక్కిరించాను. నా మొగుడ్ని నే నెంచుకోలేకపోతే అలా వుండిపోవటమే మంచి దనిపించింది. తమ్ముళ్లకు చదువు చెప్తుంటే యేమిటో ఆ ఆనందం. రాట్నందగ్గర కూర్చుంటే ప్రపంచచక్రాన్నే త్రిప్పా నన్న గర్వం! నా అప్పటి పరిస్థితిని సరిగా నేనే అవగాహనచేసుకోలే నిప్పుడు.

మీ రొచ్చారు పెళ్లి చూపులకి. మిమ్మల్ని చూడగానే నా కాళ్లు గజగజ వణికాయ్. అప్పటికి యెంతమందో వచ్చారు. కళ్లప్పగించి శృంగారంగా నా కళ్లల్లోనికి చూడబోయారు. ఆ సెంట్లు, సూట్లు, బూట్లు ఆ గజిబిజిలో - అబ్బా! శృంగారంగా యెలా చూస్తారో? తీరా—సంగీతం వచ్చా? కట్నాలేమాత్రం? ఆ సిగరెట్ పొగలు—వాళ్లని చూస్తుంటే నా శరీరంమీద నైట్రిక్ ఆసిడ్ పడిన ట్లుండేది.

ఇంట్లోమాటలు నాకు మరీ చిరాకు కలిగించేవి. వెయ్యినూటపదహార్లు కట్నానికని మూటకట్టి పెట్లో భద్రంగా వుంచారు నాన్న. అంచేత ఆయనతో మాట్లాడటమే నాకు అనవసర మనిపించింది. చిన్నప్పటినుంచి వున్నతంగా పోవటం నూరిపోసి యీనాటికి ఆయన అలా మారినందుకు నాలో నవ్వుకున్నానుకూడాను.'

చదివించటం యింత తీసుకొచ్చిం దని వచ్చిన యువకుల అర్హతలు చెప్తూ అమ్మ, నాన్నమ్మ పొగడుతుంటే వాళ్ల అజ్ఞానానికి పెద్దపెట్టున యేడవా లనిపించింది.

నాన్న ఒకసారి 'ఏమమ్మా, ఇలా అయితే ఎలా' అన్నారు. ఆ యిలాయెలాలు నాకు అర్థంకాలేదు. నే నిలా ఒంటరిగా వుండటం వాళ్లకి భారమైతే యెందుకు క్కనుక్కోవాలి. నేనేమీ జబాబు చెప్పలేదు.

ఒకసారి ఒక సబిన్సపెక్టరు ఆ కాకీడ్రెస్ తోనే పెళ్లిచూపుకు వచ్చాడు. చేతిలో చిన్నకఱ్ఱ కూడ వుంది. వాడిని చూసి నవ్వాపుకోలేకపోయాను. నాన్న కెంతో కోపం వచ్చింది. తరవాత అమ్మతో అనటం విన్నాను. 'ఎంతకాలం యిలా పోషిస్తాం? మంచీ మర్యాదా తెలీకుండా, పెద్దా చిన్నా లేకుండా వచ్చినవాళ్లందరినీ యిలా అవమానిస్తుంటే.'

'పెద్దా చిన్నా యెవరు? కష్టపడి కడుపు నింపుకున్నవాళ్లందరూ పెద్దవాళ్లే' ఏమిటో నా నరాలన్నీ పట్లుతప్పాయ్. గబగబ పుస్తకం టేబిలుమీద పెట్టి ప్రక్కగదిలోనికి పరుగెత్తాను. నాన్నను చూడగానే ఠక్కున ఆగిపోయాను. అయినా వుద్రేకంగా రావలసిన మాటలు గంభీరంగా వచ్చాయి. 'నన్ను మీ రేమీ పోషించలేదు నాన్నా. మీ అబ్బాయిలకు చదువు చెప్తుంటే కడుపు కన్నం పెట్తున్నారు. మీ కంత కష్టంగా వుంటే—'

మా అమ్మకు నా నిర్వికారమైన మాటలు నచ్చలేదు. మా నాన్న యే మనుకున్నారో-అక్కడనుంచి వెళ్లిపోయారు.

'ఏమామ్మా! పైవాళ్లకా చదువు చెప్తున్నావ్? నీ తమ్ముళ్లే కారూ'

'నా యింట్లో వున్నప్పుడు నాతమ్ములనే అభిమానం వస్తుంది. మీ రుండగా మీళ్లక్రింద వూరికే నే నేం సేవ చెయ్యఖర్లేదు.'

'ఏమిటమ్మా యీ విడ్డూరం. ఏ నోములు నోచామో తల్లీ' అమ్మ కాస్త చిరాకుతో అంది యీ మాటలు.

'ఆ నోమేదో మంచి నోమే నోచారమ్మా. ప్రొద్దున్న పోయి చెమటవోడ్చి కష్టపడి ఫైళ్లకట్టలతో సాయంత్రం యింటికి వస్తున్న నాన్నని చూసి కనికరం లేక పీకేస్తున్నాం. యీ కుటుంబభారం ఆ గుండెమీద పెట్టి గిజగిజలాడిస్తున్నాం. అప్పటికీ చాలక

నలుగురు పిల్లల్లో ఒక పిల్లకోసం చెమటోడ్చి గడించిన రెండువేలూ ఖర్చుపెట్టించేస్తున్నాం. అదేకదూ మన చేతనయ్యేది'అని అక్కడినించి వెళ్లిపోయాను.

అమ్మ నే నేడవకుండా యెందుకు పాలిచ్చింది? యెందుకు పెంచింది? అమ్మను నే నెందుకు పూజిస్తానో దేవునికూడ అందుకే పూజిస్తాను. చావు పుట్టుకలు లేకపోతే దేవుడు లేడనే నాస్తికతత్వానికి తలఒగ్గేదానినే.

అమ్మను యెందరో మహారాజుతల్లి అని పొగడడం విన్నాను. నలుగురి కుటుంబాలతో మెసలడంచేత నా గురించి యెవ రేమన్నా ఆమెనడుము విరుగుతుంది. అంతేకాకుండా మాలాంటి సామాన్యకుటుంబంలో అంత సిరిగల సంబంధాలు రావటం కష్టం. చిత్తశుద్ధిలేని మొగుడ్ని కట్టుకొనిడే సుఖపదేమీ లేదు. ఆత్మాభిమానంలేని రోకలిబండలా వుండాలి. యీ నా వుద్దేశాన్ని మావాళ్లు అర్థం చేసుకోలేదు. నే నా యింటినుంచి కదిలేటప్పుడు అమ్మకళ్ళల్లో నీ రెందుకు కారా యంటారు?

నా ఆదర్శాలకి అనువైన సంబంధం దొరకదేమో అన్న సంశయం నాలో అప్పుడప్పుడు - ఒక్కర్తినే కూర్చుని ఆలోచించుకొన్నప్పుడు కలిగేది. మళ్ళీ చటుక్కున ఆలోచన మార్చివేసేదాన్ని. మళ్లా ఆత్మవిశ్వాసాన్ని పదిలపరచుకొనేదాన్ని.

ఒకనాడు నా స్నేహితురాలొకర్తె మా యింటికి వచ్చింది. ఆమెకూ నాకూ స్నేహం చాలా గమ్మత్తుగా కలిసింది. నేను కాలేజీకి ఒకనాడు నడిచి వెళ్లిపోతోంటే నాముందుగా మెల్లిగా ఒక పెట్టెబండి వెళ్లిపోతోంది. బండిలో కూర్చున్న ఆమెకళ్లూ నా కళ్లూ కలిశాయ్. నేను నవ్వానుకామోసు, ఆమె నవ్వింది. అంతలో మా కళ్లు ఏవో మరచిపోయిన ముఖచిహ్నాల కోసం వెదక నారంభించాయ్. ఆమె బండి ఆపించి తలుపు తీసి 'రండి' అంది. నే వెళ్ళి కూర్చున్నాను. మాటలు కలిశాయ్. ఆమె టెలిఫోన్ ఆపరేటర్‌గా పనిచేస్తోం దని ఆమెభావాలు కొన్ని వ్యక్తపరచింది. నే నెవరినోతప్ప యింకా హెచ్చు చెప్పే అవసరం నాకు కనిపించలేదు. అప్పుడప్పుడూ మాయింటికి వస్తుండేది. ఆమెకు ప్రేమ పేరెత్తితే అసహ్యం. ఇలాంటివాళ్లు యెప్పుడో హెచ్చుగా ప్రేమించటమో, ప్రేమించబోవటమో జరుగుతుంది. ఒకనాడు వేళాకోళంగా అంది 'మావాళ్లు బొట్టుండదు-చదివిస్తే బ్రతుకుతుం దని చదివించారు. బ్రతుకుతున్నాగాని బొట్టు పెట్టుకోవడం మానలేదు. సంస్కారం' అంటూ ఒక్క చిరునగవుతో వెళ్ళిపోయింది.

ఆమె వచ్చి 'సుగుణా, వుద్యోగం చెయ్యకూడదూ'? అంది. నే నేమీ మాటాడలేదు. 'వస్తానంటే రేపే' అంది.

'అయితే రే పొకసారి రా' అన్నాను. ఆ మరుచటిరోజు వచ్చింది.

'క్షమించు. నాకు వుద్యోగం చెయ్యాలని లేదు. నే నింట్లో వుండి ఒకరిచేత వుద్యోగం చెయ్యించాలని వుంది. అప్పుడే నాకు స్వతంత్రం వుంటుంది'

'అయితే నీ యిష్టం. ఇదంతా భ్రమ'అని చప్పున వెళ్లిపోయింది.

నే నెంత నిలకడగా వుందా మన్నా మావాళ్లు నిలకడగా లేకుండా చేయబోయే రోజు లవి. మా నాన్నగుమాస్తాగిరితో మా వాళ్లకి గుమాస్తాపనంటే భయం. యెవరో గుమాస్తా పెళ్లిచూపులకు వస్తున్నాడంటే మావాళ్లకు చిరాకుగానే వుంది. గుమాస్తా అంటే నా కెందుకో సానుభూతి. గుమాస్తా అంటే బహుశః మానాన్న తలలో తిరిగిపోబట్టి అనుకుంటాను. పెద్దపెద్ద బి. ఏ. లు ఎమ్. ఏ. లు సబిన్సపెక్టర్లకు లేనిది వీడికా అనే వెటకారం వాళ్లలో వూగులాడింది.

నే నేమీ మాటాడలేదు. ఆ గుమాస్తాగారికి పెద్దలు గడించిన ఆస్తి చెప్పుకోదగ్గదే వుందని విన్నాక మావాళ్లలో కాస్త మార్పు రవటం గుర్తించాను.

మీ రొచ్చారు. గుమాస్తా—అవును—గుమాస్తా! నా కాళ్లెందుకు గజగజలాడాయ్? నే నిన్నాళ్లూ కష్టపడి నా మొగుడ్ని యెంచుకున్నా ననిపించింది. నా కళ్ల నే నమ్మలేకపోయాను.

నే నిప్పుడు భారతీయుణ్నే పెళ్లాడబోతున్నా. తెల్లని పాటినూలుపంచెకట్టు. పైన ఖద్దరులాల్చీ—ఎంత బాగున్నారు? అప్పటివరకు మీ ముఖం చూడలేదు. ఆ శరీరాన్ని గౌరవిస్తున్నాను. నిజానికి నా హృదయంలో నమస్కరిస్తున్నాను.

మెల్లగా మీ కళ్లలోనికి చూడాలని ప్రయత్నించాను—లేదు లేదు...చూశాను. మీరు తలదించుక కూర్చున్నారు. అలా మా నాన్నమ్మ రాకపోతే తల యెత్తేవారు కారేమో...యెత్తారు. ఆ కళ్లవేపు యెంతసేపైనా చూడాలనే వుంది. ఎటువంటి వెర్రిచూపులూ లేవే!

అదిగో...కళ్లల్లో మెల్లగా నీరు అలముకుంటోంది. మీ మనస్సెంత సుకుమారమైంది. ఇందరు బి. ఏ. లు ఎమ్. ఏ. లు. సబిన్సపెక్టర్లకూ కాకుండా ఒక గుమస్తాని పెళ్లాడటానికి ఒప్పుకుంటానని మీరు నమ్మకపోయుంటారు? ఆ నిరాశే మీ కళ్లల్లో నీరు...నేను చీరకొంగు పట్టుకోవటం మీరు చూడలేదేమో? మీమీద వ్రాలి కన్నీరు తుడాలని... ఒక అడుగు ముందుకు వేసానేమో...వెధవపిరికి. వెనకకు గబగబ వెళ్లిపోయాను.

మీ గుండెల్లో మిషన్‌చక్రాలు పరుగెత్తాయేమో అని భయపడ్డాను. మంచం మీదినుంచి లేచాను. నా కళ్లల్లో నీరు వుందని నేను గుర్తించుకోలేదు. అమ్మ చూసి 'అదేంటే యేడుస్తావ్? యిష్టం లేకపోతే కాదని చెప్తాం. దేనికైనా ఆ రోజు రావాలిగా' అప్రయత్నంగా అన్నాను 'వచ్చిందిలే అమ్మా'అని. అమ్మ నావేపు యెలా చూస్తుందో? గప్పున ప్రక్కగదిలోనికి వెళ్లిపోయాను.

కుర్చీమీద కూర్చొని గోడగడియారంవేపు చూస్తున్నాను. ఆ టిక్‌టక్‌లు నా గుండెలబ్‌డబ్‌లు కలిసి ధ్వనిస్తున్నట్లున్నయ్. గడియారంలో పెద్దముల్లు మూడో అంకెదగ్గర వుంది. అమ్మ వచ్చి పిలవటంతో దృష్టి మరల్చవలసివచ్చింది.

దగ్గరగా వచ్చి 'వాళ్లకి మాట యివ్వొచ్చమ్మా?' అంది. గడియారం ఠంగుమనేసరికి నా ఆలోచననుంచి బయటపడ్డాను. అమ్మ అలా నిలుచునేవుంది. నా మనసులో ఒక అనుమానం పెనుగులాడింది. అమ్మ ఆత్రుత తరవాత వచ్చే పరిస్థితి ఆలోచించుకోవచ్చని 'మాట యివ్వొచ్చ'న్నాను. అమ్మ వెనకాలే కొంతవరకు వెళ్లాను.

ఆ మాటలు చాటుగా వినాలని లేదు. కానీ నా ఆందోళన విననిచ్చింది. మా నాన్నమ్మ అడగటం విన్నాను, యెంత బంగారం పెట్తారని. 'కోరినంత పెట్తాఁమమ్మా—నాకింకెవరు వీడొక్కడేగా' అని అత్తయ్యగారనటం విన్నాను. మీ నోటివెంబడియే మాట వస్తుందో అని తహతహలాడాను. మీ పలుకే లేదు. మీ అమ్మ యింకొక మాట ఆడలేదు.

నేను అలా గోడకు ఆనుకొనే వున్నాను.

'మా పరిస్థితులన్నీ తెలుసునుగా అక్కయ్యగారూ! వెయ్యిన్నూటపదహార్లకన్నా హెచ్చుకట్నం యిచ్చుకోలేం.' యీ మా నాన్నమాటలకి మీ యిద్దరిలో యెవరే జవాబిస్తారో అని నా ఒళ్ళంతా చెవులయ్యాయ్. అత్తయ్య నవ్వినట్లు గుర్తించాను. వాళ్లకీ ఆడపిల్లలుండి, నిర్మొగమాటంగా కొడుకుల్ని బజారులో పెట్టి యెనుబోతుల్ని అమ్ముకొనేటట్లు మొదలేబేరాలుచేసిన అదివరకు వచ్చినవాళ్ళంతా ఒక్కసారిగా జ్ఞాపకానికివచ్చి అత్తయ్యగార్ని అక్కడే చెయ్యెత్తి నమస్కరించాను.

నాదంతా భ్రమ అని సందేహం కొట్టుకలాడటంతో మనస్సు మళ్ళీ బాధపడింది. యింత బంగారం మీద యింకొంచం కట్నం చాలదేమనేమో ఆ నవ్వు?

'అమ్మా లే పోదాం' అన్నారు మీరు. ఆ గంభీరస్వరాన్ని నా జన్మజన్మాలకీ మరచిపోను.

'బాబూ! మా అమ్మ కొడుకును అమ్ముకోటానికి యిష్టపడదు. మీకు శ్రమయిచ్చినందుకు క్షమించండి'—ఇవిగోండి మీ రానాడు ఆడిన మాటలు నా హృదయంలో గిలిగింతలు పెట్టున్నాయ్. కిలకిల నవ్వుకుంటున్నాయ్. నే బ్రతికున్నంతకాలం అలానే ఉంటయ్. అవే మీ రెంత హీనంగా పోయినా మీ పాదాలమీద నన్ను నిద్రపోనిస్తాయ్. ఆనాడు పరుగెత్తి పరుపుమీద పడి యేడ్చానండి. యేడుపులో ఆనందం లేదని యెవరంటారు? నా సంశయం తీరిపోయింది, నేనే పరుగెత్తి మిమ్మల్ని పిలవాలనుకున్నాను. కాని మిమ్మల్ని అప్పుడే పిలచే భాగ్యం లేదనుకుని అలా నాలో నేనే నవ్వుకున్నాను...హోహో... ఆయ నెంత గొప్పవారు?

సుగుణ ఆ విషయం కళ్లకుకట్టినట్లు చెప్తూనే ఆ అనుభూతి పొందుతుంటే నా శరీరం ఒక్కసారిగా ఝల్లుమంది. సుగుణ ఆనందంతో మాటలను మరిచిపోయిందనుకుంటాను. నేనే మెల్లగా లేచాను. ఆమె తలమీదకు చేతిని పోనిచ్చి మెల్లగా నా గుండెకు అన్చాను. ఆమెచూపులు నా శ్వాసను బిగబట్టించాయ్. కొంతసేపట్లో నా అభిమానమంతా కరిగిపోయి కళ్లల్లో నీరైంది.

[సశేషం]